ఘనంగా 'పైడిమర్రి' జయంతి వేడుకలు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు జయంతి వేడుకలను మంగళవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక తరిగొండ రోడ్డులోని ఆంధ్రప్రదేశ్ మైనార్టీ బాలికల జూనియర్ కళాశాలలో పైడిమర్రి వెంకట సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా అధ్యక్షులు ప్రభచరణ్ మాట్లాడుతూ భారతదేశం నా మాతృభూమి అనే ప్రతిజ్ఞ ద్వారా కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ప్రతిఒక్కరి గుండెల్లో దేశభక్తిని, జాతీయ సమైక్యతను,సమగ్రతను చాటిచెప్పిన మన తెలుగువాడు పైడిమర్రి అని కొనియాడారు. ప్రతిజ్ఞ గొప్పతనాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమామంజుల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పైడిమర్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెవివి అధ్యక్షులు

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-సంబేపల్లి (రాయచోటి)

రైతుల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇస్తూ, పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఖరీఫ్ -2025 సీజన్‌కు సంబంధించి మంగళవారం సంబేపల్లి మండలంలోని నారాయణరెడ్డిగారిపల్లె రైతుసేవా కేంద్రంలో రెండు కిలోల కార్యక్రమాలను మంత్రి ప్రారంభించారు. మొదటిగా, రైతులకు సబ్సిడీపై వేరుశనగ విత్తన బస్తాల పంపిణీ చేపట్టారు. 30 కిలోల విత్తన బస్తా ధర రూ.2850 కాగా, ప్రభుత్వం రూ.1140 రాయితీగా ఇవ్వడంతో రైతులు కేవలం రూ.1710 మాత్రమే చెల్లించి పొందే వీలుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ యంత్ర పరికరాల వ్యాపారాల అభివృద్ధిని లక్ష్యంగా ప్రభుత్వం 80 శాతం రాయితీతో కిసాన్ డ్రోన్లను అందిస్తున్నదని వెల్లడించారు. కిసాన్ డ్రోన్ల పంపిణీ కార్యక్రమాన్ని కూడా ఆయన ప్రారంభించారు. ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా వ్యవసాయ పనుల్లో సమయాన్ని, ఖర్చులను తగ్గించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమాల్లో వ్యవసాయ శాఖ అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వం నుంచి మరిన్ని రాయితీ పథకాలు, ఆధునిక పరికరాలు త్వరలో అందుబాటులోకి రానున్నాయని హామీ ఇచ్చారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

రాయచోటి : ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు అక్కడికక్కడే పరిష్కరింపస్తున్నామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని తమ క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలు ఏ ఒక్కరు కూడా సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత నిస్తోందని పేర్కొన్నారు. గతంలో రాయచోటి నియోజకవర్గంలోని ప్రజల సమస్యలు పరిష్కారానికి నోచుకోక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే వారిని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి నియోజకవర్గంలోనూ ప్రజాదర్బార్ కార్యక్రమాలు నిర్వహించి ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను మంత్రి స్వీకరించి వాటిని అక్కడికక్కడే పరిష్కరించారు.

రైతుకు విత్తన కాయల బస్తాను అందజేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సూపర్‌సిక్స్‌లో ఏ ఒక్కటీ అమలు కాలేదు

- పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు చేస్తే చర్యలు
- పిసిసి అధ్యక్షులు వై.ఎస్.షర్మిల

ప్రజాశక్తి - రాయచోటి

బిజెపి సిద్ధాంతాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తోందని పిసిసి అధ్యక్షుల వై.ఎస్. షర్మిల పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని పిసిఆర్ కల్యాణ మండలంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి డిసిసి అధ్యక్షులు గాజుల భాస్కర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కొందరిపై ఆమె ఈ సందర్భంగా అసహనం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మహా సముద్రమని అందులో మంచితోపాటు చెడు కూడా ఉంటుందని పార్టీ అభివృద్ధి చెందుతుంటే కిందకు లాగే వారు చాలా మంది ఉంటారని, వారే పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి వారిపై పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. సొంతపార్టీపై దుష్ప్రచారం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. బిజెపి సిద్ధాంతాన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు. దీనిని కాంగ్రెస్ నాయకులు ప్రజలలోకి తీసుకెళ్లాలన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని తెలిపారు. విభజన హామీల్లో ఏ ఒక్కటి బిజెపి పార్టీ నెరవేర్చలేదన్నారు. పోలవరం, రాజధాని అభివృద్ధిలో లో అన్యాయం చేశారని వాపోయారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు పార్టీలు బిజెపికి బానిసత్వాన్నాయని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని అని సూపర్‌సిక్స్‌లో ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు అన్నదాత సుఖీభవ, మహిళలకు మహాశక్తి,తల్లికి వందనం నిరుద్యోగ భృతి హామీలు నెరవేర్చలేదన్నారు. వైసిపి నేత అమరావతి మహిళలపై సజ్జల ఒక మూర్ఖుడిలా మాట్లాడారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గాజుల భాస్కర్ మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి అందరూ కలిసి పనిచేయాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మరింత విస్తరించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పిసిసి స్టేట్ జనరల్ సెక్రెటరీ అల్లా బాక్షు, జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అలీఖాన్, ప్రొగ్రెస్ ఎక్స్ కోడూరు ఇంచార్జ్ గోసాల దేవి, రాజంపేట ఇంచార్జ్ పూల భాస్కర్, పీలేరు ఇంచార్జ్ సోమశేఖర్ రెడ్డి, మదనపల్లె ఇంచార్జ్ పవన్ కుమార్ రెడ్డి, పుంగనూరు ఇంచార్జ్ మురళి మోహన్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు రాయచోటి చెన్నకృష్ణప్ప దర్బార్ బాషా, డిసిసి మహిళ ప్రెసిడెంట్ రెడ్డి నిగర్ సుల్తాన్, రాయచోటి పట్టణ అధ్యక్షులు బాబా సర్దార్, జిల్లాలోని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న షర్మిల

నారాయణ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

- నిరసనలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు నరసింహ

నారాయణ విద్యా సంస్థల వద్ద ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నారాయణ విద్యా సంస్థల్లో నిబంధనలు ఉల్లంఘిస్తూ పుస్తకాలను విక్రయిస్తూ వ్యాపారం చేస్తున్నారని, వెంటనే విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రశాంత్ నగర్‌లోని నారాయణ స్కూల్ వద్ద ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ ప్రభుత్వం నారాయణ విద్యా సంస్థలకు దాసోహమన్నట్టు వ్యవహరిస్తోందని విమర్శించారు. జిల్లా, మండల విద్యాశాఖాధికారులు అందరూ విద్యా సంస్థల మంత్రి నారాయణకు చెందినవి కావడంతో మేమేమి చేయగలుగుతామన్న ధోరణితో ఉండడం బాధాకరమని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం విద్యా సంస్థలు నడుస్తున్నాయా లేదా అని చూడాల్సిన అధికారులు చల్లాని నీడగా ప్రభుత్వం చేయడం విచారకర మన్నారు. తక్షణమే కలెక్టర్ జోక్యం చేసుకొని పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, స్టేషనరీ పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రయివేట్ విద్యా సంస్థలపై చర్యలకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూ వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనకున్న ఆంతర్యమేంటని ప్రశ్నించారు. జిల్లాలో జరుగుతున్న విద్యా వ్యాపారాన్ని ఎస్‌ఎఫ్‌ఐగా అడ్డుకుంటామని హెచ్చరించారు. జూన్ 12న విద్యా సంస్థలు తెరవాల్సి ఉండగా ఒకటో తేదీ నుంచి ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు తెరిచి వ్యాపారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు నిద్రమత్తు వీడి పుస్తకాలు, అధిక ఫీజులు పెంచి విక్రయిస్తున్న విద్యా సంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. గుర్తింపు లేని విద్యా సంస్థల జాబితాను విడుదల చేయాలని కోరారు. నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకొని పక్షంలో డిఇఒ కార్యాలయం ఎదుట నిరవధిక దీక్ష చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు అఫీద్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సమీర్, సుల్తాన్, ఇస్మ్రిల్ పాల్గొన్నారు.

రాయచోటి : జిల్లాలు నిబంధనలు పాటించని ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని స్టూడెంట్స్ ఫెడరేషన్ (పిఎస్‌ఎఫ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి కొడవలి కంటి నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం సూపరింటెండెంట్ సురేష్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా ఇంటర్నేషనల్, టెక్నో ఇ-టెక్నో, ఒలంపియాడ్, కాన్సెప్ట్, ఐఐటి, సైనిక్ వంటి పేర్లతో ప్రచారాలు నిర్వహిస్తూ వేల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నా కూడా జిల్లా విద్యాశాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని జిల్లా విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు. ఆయా విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పిఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు హాజీ అహ్మద్, అశోక్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - రాయచోటి

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. దార్తి ఆబా జన్ జాతియ గ్రామ ఉత్కర్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఎంపికైన నాలుగు మండలాలలోని 17 గ్రామాలలో ఈనెల 15 నుండి 30 వరకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రచార కార్యక్రమాలు నిర్వహించి ఆధార్ కార్డు, రేషన్ కార్డు తదితర కార్డులు లేని లబ్ధిదారులకు కార్డులను పంపిణీ చేయాలని పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అన్నమయ్య జిల్లాలో గిరిజన జనాభా ఎక్కువగా ఉన్న 4 మండలాల (లక్కి రెడ్డిపల్లి, రైల్వే కోడూరు, పెనగలూరు, కురబలకోట) ఎంపిడిఒలతో దార్తి ఆబా జన్ జాతియ గ్రామ ఉత్కర్ష అభియాన్ కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయంతో నిర్వహించే దార్తి ఆబా జన్ జాతియ గ్రామ ఉత్కర్ష అభియాన్ కార్యక్రమం పక్కాగా అమలవాలని ఆదేశించారు. గ్రామాలలో కొంతమంది లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అమలు కాని పక్షంలో వారందరికీ సహాయ సహకారాలు అందించి సంక్షేమ, అభివృద్ధి ఫలాలను వారికి అందజేయాలని సూచించారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆయుష్మాన్ భారత్ కార్డు, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్, పిఎం కిసాన్, జన్ధన్ బ్యాంక్ అకౌంట్, సికిల్ సెల్ డిసీజ్ కార్డు లేని లబ్ధిదారులకు ఈనెల 15 నుంచి 30 వరకు ప్రచార కార్యక్రమాలు నిర్వహించి అందజేయాలని పేర్కొన్నారు. అవగాహన కార్యక్రమాలను గిరిజన ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

బాల కార్మిక రహిత సమాజానికి కృషి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంస్థ సభ్యులు

బాల కార్మిక రహిత సమాజ స్థాపనకు కృషి చేద్దామని పోర్డ్ సంస్థ డైరెక్టర్ జల్లా లలితమ్మ పిలుపు నిచ్చారు. మంగళ వారం స్థానిక పోర్డ్ సంస్థ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జూన్ 12న ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని 10వ తేదీ నుండి 12వ తేదీ వరకు పట్టణంలో బాలల సంఘాలు, కిశోర బాలికల సంఘాల సభ్యులు, తల్లితండ్రులకు, కాలనీలలో పోర్డ్ సంస్థ సభ్యులు పలు కార్యక్రమాలను నిర్వహించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో బాల కార్మికులను సంపూర్ణంగా లేకుండా చేయాలంటే ప్రజలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా కృషి చేయాలన్నారు. బాలకార్మిక రక్షణ, నియంత్రణ సవరణ చట్టం 2016 ప్రకారం 6 నుండి 14 ఏళ్ల బాల బాలికలు ఇళ్లలోగాని, పరిశ్రమలలో గాని, వ్యాపారాలలోగాని, కూలి పనులలో పెట్టుకోకూడదని పేర్కొన్నారు. 15 నుండి 18 ఏళ్ల పిల్లలను ప్రమాదకరమైన పనులలో పెట్టుకోకూడదని చట్టం చెప్పుతుందన్నారు. చట్టాన్ని ఉల్లంఘించి ఆ వయసు పిల్లలను పనుల్లో పెట్టుకున్నట్లయితే చట్టం ప్రకారం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అనంతరం ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పోర్డ్ సంస్థ ప్రతినిధులు నిర్మల, సుభాషిణి, స్వర్ణ, జలజ, అల్తాఫ్, జయలక్ష్మి, నరసింహ పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఐద్వా నాయకులు

బాలిక మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

- ఐద్వా జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని మంజునాథ కాలనీలో సోమవారం రాత్రి అనుమాస్పద స్థితిలో మృతి చెందిన బాలిక మస్తానీ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కన్వీనర్ ఎం.భాగ్యమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం ఐద్వా సభ్యులు రెడ్డి ప్రసన్న, గీతాంజలితో కలిసి ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి మృతురాలి తల్లిదండ్రులు గఫూర్, హసీనాలను పరామర్శించారు. మస్తానీ మరణంపై విచారించగా తమ కుమార్తెను ఎవరైనా ఏమైనా చేశారో మోనని భయం భయంగా చెప్పారని భాగ్యమ్మ తెలిపారు. తాము చాలా పేదవాళ్లమని, పోలీసు కేసులు ఎదుర్కొనే శక్తి తమకు లేదని, మా బిడ్డే లేనప్పుడు కేసులు మాకెందుకని ఆవేదనగా తల్లిదండ్రులు చెప్పరన్నారు. మస్తానీ మరణంపై పోలీసులు సమగ్రంగా విచారణ జరపి, అమ్మాయికి తగు న్యాయం చేసి, తల్లిదండ్రులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పోలీసులు నిష్పక్షిపాతకంగా వ్యవహరించి, ఇటువంటి దుర్ఘటనలను ఖండించి, పునరావతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న బహుజనసేన సభ్యులు

హాస్టళ్లలో మెస్ ఛార్జీలు పెంచాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్రంలో పేద విద్యార్థుల నాణ్యమైన భోజనాన్ని అందించడంతో పాటు మెస్ ఛార్జీలను పెంచాలని బహుజనసేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు ఆవేదన చెందారు. రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి హాస్టళ్ల విద్యార్థుల భోజన విషయంలో అన్ని ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించాయన్నారు. మంగళవారం బహుజనసేన ఆధ్వర్యంలో సబ్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సాధారణ ప్రభుత్వ హాస్టల్స్, కస్తూర్బా, మోడల్ స్కూల్స్, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, విద్యార్థులు నడుపు కుంటున్న హాస్టల్స్, ఐదో తరగతి నుంచి పదవ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి మూడు పూటల భోజనం ఖర్చు రూ.46 ఉందన్నారు. ఇంటర్ నుండి పీజీ వరకు ఒక్కో విద్యార్థికి మూడు పూటల భోజనం ఖర్చు రూ.53 లుగా ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. కాంట్రాక్టర్లు లాభాపేక్ష వల్ల పౌష్టికాహారం అందించకుండా భోజన పథక విధానాన్ని అవలంభిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని బహుజన సంఘాలు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంఘాలు ఈ విషయంపై పెద్ద ఎత్తున ఉద్యమాలకు పిలుపునిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం అంత వరకూ తెచ్చుకోవద్దని హితువు పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సమాఖ్య అధ్యక్షులు కోనేటి దివాకర్, ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరసింహులు, నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, వాల్మీకి సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, బిసి సంక్షేమ సంఘం మహిళా నాయకురాలు మల్లిక, ఒబిసి విద్యార్థి సంఘం వెంకట్ యాదవ్, సిపిఐ మురళి, బహుజనసేన మహిళ అధ్యక్షురాలు మేరీ, నాయకులు గిన్నెల మనోహర్‌రెడ్డి, పుల్లూరి జయశంకర్, ఆటో యూనియన్ నాయకులు లక్ష్మీనారాయణ, కొమ్ము హరిబాబు, రాఘవేంద్ర యాదవ్, బురుజు శివశంకర్, భాను ప్రకాష్, సిద్ధిగల నరేష్, మావిళ్ళ వెంకటేష్, ముక్తియార్‌బాషా, ప్రభాకర్ పాల్గొన్నారు.

మహిళలపై అనుచిత వ్యాఖ్యలు తగవు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మహిళలను కించపరిస్తే పుట్టగతులు ఉండవని రాజంపేట పార్లమెంట్ మహిళా ఉపాధ్యక్షులు దాసరి రాజువాణి, క్రాంతి ప్రియ తెలిపారు. మహిళలపై వైసిపి నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మంగళ వారం టిడిపి మహిళా విభాగం ఆధ్వర్యంలో పార్లమెంట్ క్యాంపు కార్యాలయం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఎఒకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలలో ప్రజలు గుణపాఠం చెప్పిన వైసికికి బుద్ధి రాలేదన్నారు. సాక్షి పత్రిక వలన పత్రికలకే కళంకం ఏర్పడుతుందన్నారు. హద్దు మీరితే సజ్జల రామకృష్ణారెడ్డికి బడితపూజ తప్పదని హెచ్చరించారు. ప్రజలు, మహిళలపై ఇష్టం వచ్చినట్లు అసభ్యకరంగా మాట్లాడితే తగిన గుణపాఠం చెప్పాల్సి వస్తుందని తెలిపారు. మహిళలను, ప్రాంతాలను వారి మనోభావాలను గౌరవించలేని వారికి తగిన గుణపాఠం చెబుతామని తెలియజేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

కొత్తపల్లె రైతులతో వ్యవసాయ శాస్త్రవేత్తలు

యాజమాన్య పద్ధతులపై దృష్టి సారించండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: పోషక యాజమాన్య పద్ధతులపై దృష్టి సారించాలని వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ నవ్యజ్యోతి సూచించారు. కలికిరి కెవికె సమన్వయకర్త డాక్టర్ కె.మంజుల పర్యవేక్షణలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని కొత్తవారిపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో నవ్యజ్యోతి మాట్లాడుతూ వేరుశనగ, నువ్వులలో నూతన వంగడాలు, యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఉద్యాన శాస్త్రవేత్తలు డాక్టర్ ఎ.శ్రీనివాసులు మాట్లాడుతూ టమోటా పంటలో సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ పద్ధతుల గురించి వివరించారు. రైతులు పంటలకు సరిపడా ఎరువులు మాత్రమే వేసుకోవాలని, జీవ శిలీంధ్ర నాశినులు, జీవన ఎరువుల ప్రాముఖ్యత గురించి వివరించి, వాటిని ఎలా వినియోగించాలో తెలియజేశారు. కలికిరి ఉద్యాన పాలిటెక్నిక్ అధ్యాపకులు డాక్టర్ రమేష్ భూసార పరిక్షణ యొక్క ప్రాముఖ్యతను తెలియజేసి, రైతులందరూ తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించి భూమి ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఆర్.ఎస్.కె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. అనంతరం రైతు ద్వారకనాథ్ సాగు చేసిన తమలపాకు తోటను సందర్శించారు.

ఎన్‌బికె ట్రస్ట్‌కు రూ.5.55 లక్షల విరాళం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ చేపడుతున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని పట్టణానికి చెందిన టిడిపి ఎన్‌ఆర్‌ఐ విభాగం నాయకులు లోకేష్ కొణిదెల కితాబిచ్చారు. హైదరాబాదులో బాలకృష్ణను కలిసి ఎన్‌బికె చారిటబుల్ ట్రస్టుకు రూ.5,55,555 చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ నటుడిగా, ఎమ్మెల్యేగా బాలకృష్ణ ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని పేర్కొన్నారు. బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆసుపత్రిని ప్రారంభించి అతి తక్కువ ఖర్చుతోనే తెలుగు ప్రజలకు వైద్యం అందిస్తున్నారని పేర్కొన్నారు. బాలకృష్ణ చేస్తున్న సేవా కార్యక్రమాల పట్ల ఆకర్షితులై తనవంతుగా విరాళాన్ని అందజేసినట్లు తెలిపారు.

సౌర విద్యుత్ ప్లాంట్లకు రుణాలు

- జిల్లా పర్యవేక్షణ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

రాయచోటి డివిజన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పేరూరి యుగంధర్ ఆపరేషన్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా అన్నమయ్య జిల్లా పర్యవేక్షణ అధికారి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రధాన మంత్రి సూర్య పథకం కింద సౌర విద్యుత్ ప్లాంట్‌ను పెట్టుకోవడానికి రూ.78 వేల సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని పథకం ద్వారా విద్యుత్ బిల్లును ఆదా చేయవచ్చని చెప్పారు. పర్యావరణానికి మేలు చేయవచ్చున్నారు. ఒకసారి పెట్టుబడి పెట్టి సోలార్ ప్యానల్‌ను అమర్చుకోవడం వల్ల 40 సంవత్సరాల పాటు సున్నా కరెంట్ బిల్లుతో సంతోషంగా జీవించొచ్చని పేర్కొన్నారు. ఈ పథకం గృహ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుందిన్నారు. ఈ పథకానికి బ్యాంకు వారు 90 శాతం రుణం 7 శాతం వడ్డీతో ఇస్తారని తెలియజేశారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యుగంధర్ గారు మాట్లాడుతూ 1 కెడబ్లూ కు రూ.30 వేలు, 2 కె డబ్ల్యూకు రూ.60 వేలు, 3 కె డబ్ల్యూకు ఆపైన రూ.78 వేల సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుందని చెప్పారు. బిసిలకు అదనంగా రూ.20 వేలను సబ్సిడీగా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనుందని తెలియజేశారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, జూనియర్ జూనియర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్, ఉద్యోగులు, కార్మికులు, వినియోగదారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు

సమావేశంలో మాట్లాడుతున్న సి.హెచ్.చంద్రశేఖర్

ప్రజాశక్తి-పుల్లంపేట

కార్మికుల హక్కుల కోసం జులై 9న చేపట్టే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.చంద్రశేఖర్ పేర్కొన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 29 చట్టాలను, నాలుగు లేబర్ కోడులుగా మార్చి పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చిన వాటిని రద్దు చేయాలని, పిలుపునిచ్చారు. పుల్లంపేటలో మంగళవారం సిఐటియు మండల సమన్వయ కమిటీ సమావేశం శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం 8 గంటల పనిని, 12 గంటలకు పెంచడం, రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం 8 గంటల పని 10 గంటలకి పెంచుతూ క్యాబినెట్ తీర్మానించడం దుర్మార్గమన్నారు. కనీస వేతనాల చట్టం, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాడ్యుటి లాంటి హక్కులు కార్మికులు కోల్పోతారన్నారు. స్కీం వర్కర్లకు, అంగన్వాడీ, ఆనిమేటర్స్, ఆశ, మధ్యాహ్న భోజనం, లాంటి వారికి గౌరవ వేతనం పేరుతో వెట్టి చాకిరి చేస్తున్నారని అన్నారు. మోటార్ ట్రాన్స్‌పోర్ట్ ఆక్ట్ ప్రకారం, డ్రైవర్లు ప్రమాదం యాక్సిడెంట్ జరిగితే పది సంవత్సరాలు జైలు శిక్ష, రూ.10లక్షలు నష్టపరహారం చెల్లించే విధంగా మార్చారని అన్నారు. అంగన్వాడీ, ఆశ, విఒఎ, మధ్యాహ్న భోజనం, విఆర్‌ఎలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జులై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు, మద్దిల ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం, సిఐటియు పుల్లంపేట మండల సమన్వయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చంద్రశేఖర్ ప్రకటించారు. కో-కన్వీనర్‌గా, పి.శ్రీనివాసులు, కమిటీ సభ్యులుగా, వెంకటరమణ, సునీత, స్వర్ణ లక్ష్మి, అమరావతి, వనజ కుమారి, నాగలత, విజయలక్ష్మి, చెంచులక్ష్మి, లక్ష్మి, విజయ, పెంచలయ్య, కో-ఆప్షన్ మెంబెర్‌గా శ్రామిక, మహిళ కన్వీనర్‌గా ఎస్.శ్రీలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సాత్విక్‌ను అభినందిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

యువత క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-నందలూరు

యువత చదువులతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని తద్వారా మన గ్రామానికి, జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు వాటి అంతట అవే వస్తాయని లయన్స్ క్లబ్ అధ్యక్షులు కుర్రా మణియాదవ్, వాకర్స్ క్లబ్ కార్యదర్శి ఉప్పు శెట్టిసుధీర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ గతంలో నందలూరు అంటేనే క్రీడలకు ప్రసిద్ధి గాంచిందని మంచి క్రీడాకారులు ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించారని అన్నారు. ఇప్పటి యువత క్రీడా మైదానం వైపు చూడకుండా మొబైల్ ఫోన్లకు వ్యసనంగా మారి శారీరక శ్రమ లేకుండా ఒబెసిటికి గురికావడం చాలా బాధాకరమైన విషయమని తెలిపారు.ఈ సందర్భంగా క్రికెట్ సబ్ సెంటర్‌లో భారతాల సాత్విక్ చిన్న వయసులోనే బౌలింగ్‌లో అత్యుత్తమ ప్రతిభను కనపరుస్తున్నందుకు భవిష్యత్తులో క్రీడలలో రాణించి మంచి స్థాయికి రావాలని ఆకాంక్షించారు. సాత్విక్ ను క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించడం జరిగింది. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ సభ్యులు మోడపోతుల రాము, గురు ప్రసాద్, క్రికెట్ సబ్ సెంటర్ కోచ్ ఫిరోజ్‌ఖాన్, విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ ప్రతినిధి శివకోటి, జంగం శెట్టి హరి, గుండు సురేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

గాలి వీచిందా... కరెంట్ గోవిందా

ప్రజాశక్తి వీరబల్లి

ఏమాత్రం గాలి వీచినా.. చిన్నపాటి వర్షం కురిసినా మండలంలోని వంగిమళ్ళ, డి.రాచపల్లి పంచాయతీలలో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. గ్రామాల్లో అంధకారం అలుముకుంటుంది. దోమలు స్వైర విహారం చేస్తూ ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. విద్యుత్ వచ్చేవరకు జనాలు దోమలతో యుద్ధం చేయక తప్పలేదు. ఓవైపు ఉక్కపోత, మరోవైపు దోమల బెడదతో ప్రజలు అల్లాడి పోతున్నారు.. సంబంధిత అధికారులు స్పందించి పూర్తిస్థా యిలో సిబ్బందిని అందుబాటులో ఉంచి విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు నిమ్మనపల్లి మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి డి.నరసింహులు అధ్యక్షతన బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండల సమావేశం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఉదయం 11 గంటలకు నిర్వహించబడునని పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు, కో-ఆప్షన్ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను తీసుకురావాలని తెలిపారు.

ఉద్యాన పాలిటెక్నిక్ ప్రవేశాలకు 19 వరకూ గడువు

ప్రజాశక్తి-కలికిరి

డాక్టర్ వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలో ఉద్యాన డిప్లమో మరియు పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశాలకు నోటిఫికేషన్‌కు జూన్ 19 వరకే చివరి గడువు అని కలికిరి ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.స్వరాజ్యలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఈ కోర్సులలో ప్రవేశానికి పదో తరగతి ఉత్తీర్ణలై లేదా ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. డాక్టర్ వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారంను నింపి అవసరమైన సర్టిఫికెట్ కాపీలను జత చేసి రిజిస్టర్ డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవి ద్యాలయం, వెంకట రామన్నగూడెం, పశ్చిమగోదావరి జిల్లా కార్యాలయానికి పంపాలని తెలిపారు. ఉద్యాన రంగం అభివృద్ధి జరుగుతున్న దృష్ట్యా డిప్లొమా కోర్సుల ద్వారా నైపు ణ్యత పొందిన విద్యార్థులకు భవిష్యత్తులో అనేక ఉద్యోగ, వ్యాపార అవకాశాలు కలిగి ఉంటాయని కావున అర్హత కలిగిన విద్యా ర్థులు దరఖాస్తు చేసుకోగలరని తెలిపారు. మరిన్ని వివరాలకు 99634 09137, 7382633691 నెంబర్లకు ఉదయం 10 నుంచి సాయంత్రం నాలుగు గంటల లోపు సంప్రదించగలరని కోరారు.

'కొమ్మినేని' అరెస్టు అక్రమం

- మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా

ప్రజాశక్తి - కడప

రాష్ట్రంలో ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్‌బాషా అన్నారు. మంగళవారం తన నివాసంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో డైవర్ట్ రాజకీయాలకు చంద్రబాబు నాయుడు అంబాసిడర్ అని అన్నారు. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చాక చంద్రబాబు వైఫల్యాలను బయట పెట్టారన్నారు. అప్పట్లో ఎన్‌టివి నుండి కొమ్మినేనిని తొలగించాలని చంద్రబాబు నాయుడు యాజమాన్యంపై ఒత్తిడి తీవ్రంగా చేశారన్నారు. చర్చ వేదికలో సీనియర్ జర్నలిస్ట్ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలను పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. ఆ స్థానంలో ఎవరు ఉన్నా వైసిపి ఒప్పుకోదన్నారు. ఇచిన హామీలు నెరవేర్చకుండా డైవర్ట్ రాజకీయాలు చంద్రబాబుచేస్తున్నారన్నారు. పదవ తరగతి పరీక్షల్లో అనేక వైపల్యాలు బయటపడ్డాయి అన్నారు.విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్ని విధాలుగా వైఫల్యం చెందాడు అన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కడప, కర్నూలు జట్ల విజయం

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ అండర్ -19 వన్డే క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభ రోజు సోమవారం కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు జట్టుపై 7 వికెట్ల తేడాతో కడప జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన కడప జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు 33.1 ఓవర్లలో 124 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని ప్రణవ్ 22 పరుగులు చేశాడు. కడప జట్టులోని ధీరజ్ కుమార్ రెడ్డి 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 125 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 15.4 ఓవర్లలో 3 వికెట్లు నష్టానికి 128 పరుగులు సాధించి 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని రణధీర్ రెడ్డి 54, రోహిత్ వర్మ 37 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని మంజునాథ్ 2 వికెట్లు తీసుకున్నాడు.

వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టు పై 7 వికెట్ల తేడాతో కర్నూలు జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 48.1 ఓవర్లలో 176 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని కిన్ను కిషన్ 50 పరుగులు చేశాడు. కర్నూలు జట్టులోని మహిత్ 3, నౌసూన్ కళ్యాణ్ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 177 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 34.0 ఓవర్లలో 3 వికెట్లు నష్టానికి 180 పరుగులు చేసి 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని విఖ్యాత్ 66 పరుగులు చేశాడు.

తలపడుతున్న కడప, చిత్తూరు జట్లు

నిర్మాణానికి నోచని తహశీల్దార్ కార్యాలయం

- ఏడేళ్లుగా పునాదులకే పరిమితమైన భవన నిర్మాణాలు
- ఇప్పటికైనా పూర్తి చేయాలని కోరుతున్న మండల ప్రజలు

పునాది దశలోనే ఆగిపోయిన తహశీల్దార్ భవన నిర్మాణం

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలో తహశీల్దార్ కార్యాలయ భవనం నిర్మించేందుకు ఏడేళ్ల క్రితం వేసిన పునాదులు నేటికీ అలాగే దర్శనమిస్తున్నాయి. తహశీల్దార్ భవన నిర్మాణం కలగానే మిగిలిపోయింది. మండలానికి నూతన తహశీల్దార్ భవనం నిర్మాణం జరుగుతుందని ఆశ పడ్డ ప్రజలకు నిరాశే మిగిలింది. 2018లో అప్పటి టిడిపి ప్రభుత్వం హయాంలో కోటి రూపాయలు మంజూరు చేసి తహశీల్దార్ భవన నిర్మాణానికి చర్యలు చేపట్టింది. పునాదు లు పూర్తి చేసే సమయానికి ప్రభుత్వం మారడంతో నిధులు గుత్తేదారుకు అందలేదు.సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదార్లు భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిపివేశారు. పిల్లర్ల దశలోని పనులు నిలిచి అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. ఆ తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం దీని వంక కన్నెత్తి కూడా చూడక పోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ప్రస్తుతం పిల్లర్ల కోసం వినియోగించిన ఇనుప కడ్డీలు తుప్పు పట్టి పోయాయి. పునాదుల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోయి అధ్వానంగా తయారయ్యాయి.కనీస సౌకర్యాలు లేకపోవడంతో తహసిల్దార్ కార్యాలయ ఉద్యోగులు విధులు నిర్వహించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొని తహశీల్దార్ కార్యాలయ భవన నిర్మాణం పూర్తిచేయాలని 12 గ్రామ పంచాయతీల ప్రజలు కోరుతున్నారు.

తక్షణమే భవన నిర్మాణ పనులు చేపట్టాలి

మండలంలో ఎన్నో ఏళ్లుగా తహశీల్దార్ కార్యాలయం భవనం అద్దె భవనంలో నడుస్తుంది. 2018లో టిడిపి ప్రభుత్వం చేపట్టిన భవన నిర్మాణ పనులు ఆగిపోయాయి. అద్దె భవనం దగ్గర ప్రజలు ఉండడానికి సౌకర్యంగా లేదు. ఇరుకైన భవనంలో అధికారులు కూర్చోవడానికి ఇబ్బంది పడుతున్నారు. శాశ్వతంగా కార్యాలయ భవన నిర్మాణాలు పూర్తి చేయాలి.

-చిన్నగాళ్ల రామ్మోహన్, వంగిమళ్ళ

అద్దె భవనం వద్దు

నూతన తహశీల్దార్ భవన నిర్మాణం కోసం ఏడేళ్లుగా ఎదురు చూస్తున్నారు. అద్దె భవనంలో అధికారులతో పాటు ప్రజలకు ఇబ్బందిగా మారింది. కొత్త భవనం నిర్మాణ పనులు చేపడితే బాగుంటుంది. అధికారులకు కూర్చోవడానికి, ప్రజలు ఉండడానికి సౌకర్యంగా ఉండే కార్యాలయం కావాలి. ప్రభుత్వం స్పందించి నిలిచి పోయిన తహశీల్దార్ కార్యాలయం పూర్తి చేయాలి.

- రాజశేఖర్‌రాజు, ఎఫ్ఆర్‌డిఎస్ చైర్మన్, గుర్రప్పగారిపల్లి

వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్యే

నిమ్మనపల్లె : రైతులకు వేరుశనగ విత్తన కాయలను అందిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న వేరుశన విత్తనకాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందిస్తున్న వేరుశనగ విత్తనాలను మంగళవారం మదనపల్లి వ్యవసాయ సంచాలకులు శివశంకర్, కూటమి ప్రభుత్వ నాయకులతో కలసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతే రాజు అన్న నినాదంతో కూటమి ప్రభుత్వం రైతులకు అనేక సదుపాయాలను అందుబాటులోకి తెస్తోందని అన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ ఆధారంగా రైతులు అధిక శాతం వేరుశనగ పంట ను సాగు చేస్తారన్నారు. రైతులకు 40 శాతం రాయితీపై వేరుశనగ విత్తనా లను సకాలంలో అందిస్తూ సిఎం చంద్రబాబు అండగా నిలబడుతున్నారని అన్నారు. మండలానికి కే-6 తెల్ల రకం 305 క్వింటాలు, నారాయణి ఎర్ర రకం 800 క్వింటాలు రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయని అన్నారు. మొత్తం 1100 క్వింటాల వేరుశనగ విత్తనాలు మండలానికి కేటాయించినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 1400 మందికి పైగా రైతులు భూసార పరీక్షలను చేయించుకున్నారని, అటువంటి వారికి ఎటువంటి పంటలు సాగు చేయాలి, ఎటువంటి ఎరువులు వాడాలని సూచిస్తూ భూసార పరీక్ష పత్రాలను పంపిణీ చేశారు. వేరుశనగ పంటలకు బలాన్ని చేకూర్చే జిప్సంను, పచ్చిలొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. రైతులకు 50శాతం సబ్సిడీపై అందిస్తున్న మందుల పిచికారి యంత్రాలను పంపిణీ చేశారు.ఈ నెలలోనే రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రభుత్వం అందించడానికి కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారి ఈశ్వర్ ప్రసాద్‌రెడ్డి, టిడిపి నాయ కులు రాజన్న, రెడ్డప్ప రెడ్డి, మల్లికార్జున, శ్రీపతి, సుధాకర, దేవేంద్ర రెడ్డి, రఫీ, జనసేన మండలాధ్యక్షులు ప్రదీప్ సింగ్, సర్పంచులు సుబ్రమణ్యం, పాపులమ్మ మల్లప్ప, రెడ్డప్ప, తహశీల్దార్ అమర్నాథ్, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.**పీలేరు:** ప్రభుత్వం అందిస్తున్న రాయితీ వేరుశనగ విత్తన కాయలను ఖరీఫ్ రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామమూర్తి తెలిపారు. ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక ఎఎంసి కార్యాలయం ఆవరణంలో వేరుశనగ విత్తన పంపిణీ కార్యక్రమాన్ని పాలకమండలి, వ్యవసాయ శాఖ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఎఒ రమాదేవి మాట్లాడుతూ నారాయణి రకం వేరుశనగ కాయలు 30 కిలోల బస్తా రూ.1,710, కె6 రకం వస్తా రూ.1,674తో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మాజీ మండల అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి, టిడిపి నాయకులు పోలి శెట్టి సురేంద్ర, జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి కలప రవి, డైరెక్టర్లు అమర్నాథ్ రెడ్డి (పాల అమర), లక్ష్మీకాంతమ్మ, రమాదేవి, అనురాధ, వనిత, రహంతుల్లా, శివమ్మ, అగ్రికల్చర్ అధికారులు హిమబిందు, నజీర్, రైతులు, మార్కెట్ యార్డ్ సిబ్బందిపాల్గొన్నారు.

నేటి నుంచి విత్తనాల రిజిస్ట్రేషన్లు

వాల్మీకిపురం: బుధవారం నుంచి మండల వ్యాప్తంగా వేరుశెనగ విత్తనాల కోసం సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారిణి హేమలత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి కె6 రకం 383 క్వింటాళ్లు, నారాయణి రకం 870 క్వింటాళ్లు, టిసిజిఎస్ రకం 99.9 క్వింటాళ్లు కేటాయించారని తెలిపారు. కె6 రకం 30కిలోల బస్తా రూ.2790 కాగా సబ్సిడీ రూ.1116 పోనూ రైతు రూ.1674 చెల్లించాలని, టిసిజిఎస్ రకం 30 కిలోల బస్తా రూ.2790 కాగా సబ్సిడీ రూ.1116 పోనూ రైతు రూ.1674 చెల్లించాలని, నారాయణి రకం 30 కిలో బస్తా రూ.2850 కాగా సబ్సిడీ 1140 పోనూ రైతు రూ.1710 చెల్లించాలని ఆమె తెలిపారు. ప్రభుత్వం 40శాతం సబ్సిడీతో వేరుశెనగ విత్తనాలను పంపిణీ చేస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. **కలికిరి:** ప్రభుత్వం అందించే సబ్సిడీ వేరుశనగ విత్తనాలకు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వ్యవసాయ అధికారిని మమతారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి కే6 రకం 300 కింటాలు, నారాయణి రకం 690 క్వింటాళ్లు, టి సి జి ఎస్ రకం 99.9 క్వింటాళ్లు ప్రభుత్వం కేటాయించినట్లు ఆమె తెలిపారు. అర్హులైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ ను తమ వెంట తీసుకెళ్లి తమకు సంబంధించిన రైతు సేవా కేంద్రాలు దగ్గరికి వెళ్లాలని ఆమె తెలిపారు. కే6 30 కేజీల బస్తా 1664, టి సి జి ఎస్ 30 కేజీలు బస్తా 1664, నారాయణ 30 కేజీలు బస్తా 1710 రూపాయలు ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆమె తెలిపారు. అర్హులైన రైతులు ఈ సబ్సిడీ వేరుశనగ విత్తనాలను తీసుకెళ్లి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

షైనింగ్ స్టార్ అవార్డులు అందుకున్న విద్యార్థులు

రాజంపేట : ప్రశంసా పత్రాలు చూపుతున్న రాజు హైస్కూల్ విద్యార్థులు

రాజు హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

10వ తరగతి పరీక్షలలో ప్రతిభ కనబరిచిన రాజు హై స్కూల్ విద్యార్థులకు ప్రతిభ అవార్డులు దక్కాయి. రాజు హై స్కూల్లో విద్య అభ్యసించిన ఇండ్లూరి రెడ్డి రాహిత్య(596/600), టంగుటూరి నాగ కార్తీక్(595/600), గూడూరు నిహారిక(595/600), ఏకశిరి నవ్యశ్రీ (510/600) లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభ అవా ర్డును ప్రధానం చేసింది. ఈ అవార్డులను రాయచోటిలో సోమవారం నిర్వహించిన షైనింగ్ స్టార్స్ కార్యక్రమంలో కలెక్టర్ చామకూరి శ్రీధర్ అందజేశారు. ప్రశంసా పత్రం, పతకం, నగదును విద్యార్థు లకు అందజేసి కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం రాజు హైస్కూల్ సిఇఒ గుంటి మడుగు రఘురామరాజు, ప్రిన్సిపల్ వాయల్పాటి మోహన్ రెడ్డి ప్రతిభా అవార్డులు సాధించిన విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యలో రాణించేందుకు అహర్నిశలు కృషి చేయాలన్నారు. అదేవిధంగా పోటీ పరీక్షలలో ప్రతిభ కనబరచాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవార్డు అందుకున్న అంకిత

మదనపల్లె అర్బన్ : పట్టణానికి చెందిన విద్యార్థిని ఆర్. తేజ స్విని ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకుగాను 989 మార్కులు సాధిం చింది. రాష్ట్ర ప్రభుత్వం ఆ విద్యార్థినిని ప్రతిభ అవార్డుకు ఎంపిక చేసింది. సోమవారం జిల్లా కేంద్రమైన రాయచోటిలో జరిగిన షైనింగ్ స్టార్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్ర మంలో కలెక్టర్ శ్రీధర్‌చామకూరి, టిడిపి నాయకులు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకుంది. విద్యార్థినికి మెడల్, ప్రశంసాపత్రం, నగదు ప్రోత్సాహకంలో భాగంగా రూ.20 వేల చెక్కును అందిం చారు. కార్యక్రమంలో జిల్లా డివైఇఒ రవి, డిఇఒ సుబ్ర హ్మణ్యం, విద్యార్థిని తల్లిదండ్రులు రామశేషు, రేణుక పాల్గొన్నారు. ప్రతి విద్యార్థి తేజశ్వినిని ఆద ర్శంగా తీసుకుని క్రమశిక్షణ, పట్టుదలతో చదివి రాణించాలన్నారు. **కలకడ:** మండల కేంద్ర మైన కలకడ కస్తూరిబా గాంధీ బాలికల కళాశాల లో చదివిన ఇంటర్ విద్యార్థిని అంకిత షైనింగ్ స్టార్స్ అవార్డు లభించింది .రాయచోటి సుధ కన్వెన్షన్‌లో జరిగిన షైనింగ్ స్టార్స్ సన్మాన కార్యక్రమంలో కలెక్టర్, మండిపల్లి లక్ష్మి ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా మెడల్, ప్రశంసాపత్రం, రూ.20 వేలు చెక్కును తీసుకున్నారు. అంకితను ప్రిన్సి పల్, సిబ్బంది అభినందించారు. **పీలేరు:** పీలేరు విఎస్ఎన్, ఎస్‌విఎస్ఎన్‌కు చెందిన నలుగురు విద్యార్థులు కలెక్టర్ శ్రీధర్ చావకూరి చేతుల మీదుగా షైనింగ్ స్టార్ ప్రతిభ పురస్కారాలు అందుకున్నారు. విఎస్ఎన్, ఎస్‌విఎస్ఎన్ విద్యా సంస్థల అధినేత్రి వడ్లమూడి మాధవి మాట్లాడుతూ తమ విద్యాసంస్థల్లో 10వ తరగతి చదివిన విద్యా ర్థులు పి.వెన్నెల స్నేహిత, యం.కార్తీక్, కె. జస్మిత, కె.వైష్ణవి షైనింగ్ స్టార్ ప్రతిభ పురస్కా రాలు అందుకున్నారని అన్నారు. ఇందుకు కృషి చేసిన విద్యార్థులను, ఉపాధ్యాయు లను ఆమె అభినందించారు. **కలికిరి:** మండలానికి చెందిన ఆరుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్స్ 2025 అవార్డులు కలెక్టర్ శ్రీధర్ చామకూరి చేతుల మీదుగా అందుకున్నారు. మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల పాఠశాల విద్యార్థులు ఎ.లక్ష్మీప్రియ, ఎల్.దివ్య, బి. శిరీష ఉత్తమ మార్కుల సాధించి షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆదిస్ ఇండి యన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి కె.గోవర్ధన్ రెడ్డి, అక్షర స్కూల్ విద్యార్థి జె.జీవన్‌కుమార్, బాలికోన్నత పాఠశాల విద్యార్థి జెన్నీఫర్ సలోని కలెక్టర్ చేతుల మీదుగా షైనింగ్ స్టార్ అవార్డులు స్వీకరించారు.

కలికిరి :ప్రశంసా పత్రాలతో అవార్డు పొందిన విద్యార్థులు

పనిచేయని ఎపి సేవా పోర్టల్

ప్రజాశక్తి - చాపాడు :ప్రజలకు వివిధ రకాల సేవలు దరఖాస్తు చేసుకునేందుకు వినియోగించే ఎపి సేవా పోర్టల్ నాలుగు రోజులుగా పనిచేయడం లేదు. సచివాలయం, మీసేవ కేంద్రాల్లో ఎలాంటి సేవలు ప్రజలు పొందేందుకు అవకాశం లేదు. ఎపి సేవా పోర్టల్ మరమ్మతులు చేపడుతున్నట్లు కంప్యూటర్‌లో కనబడుతోంది. ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, భూములకు సంబంధించిన అడంగల్, 1 బి, రేషన్ కార్డు వంటి ఎలాంటి దరఖాస్తుకు నమోదు చేసుకునేందుకు అవకాశం లేకుండా నిలుపుదల చేశారు. దీనిపై ముందస్తుగా ప్రజలకు అవగాహన కల్పించక పోవడంతో వారు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. సచి వాలయం, మీసేవ సెంటర్లకు వివిధ ధ్రువపత్రాల కోసం ప్రజలు వస్తూ వెబ్ సైట్ పనిచేయడం లేదని తెలుసుకొని వెనుదిరిగి వెళుతున్నారు. ఒకటి రెండు రోజుల్లో తిరిగి సేవలు ప్రారంభమవుతాయని సిబ్బంది ప్రజలకు సూచిస్తున్నారు.

రామాపురం : ప్రతిజ్ఞ చేస్తున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్, కిశోర బాలికలు

బాల్య వివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దుకుందాం

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని సరస్వతిపల్లి గ్రామపంచాయతీని బాల్యవివాహ రహిత గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుకుందాం అని గ్రామ సర్పంచ్ మునీర్‌బాషా, ఐసిడిఎస్ రామాపురం సెక్టర్ సూపర్‌వైజర్ హుస్సేనమ్మ పేర్కొన్నారు. మండలంలోని సరస్వతిపల్లి సచివాలయం దళితవాడ అంగన్వాడీ కేంద్రంలో కిషోర్ బాలికల వికాసం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో బాల్య వివాహాలు నిర్మూలనకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కిశోరబాలికల వికాసానికి పంచాయతీ పరిధిలో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా సహకారం అందిస్తామని అన్నారు. మండలానికి సరస్వతిపల్లె పంచాయతీ ఒక రోల్ మోడల్ గా నిలవాలని ఆకాంక్షించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ కిశోర బాలిక వికాసం ద్వారా వేసవి శిబిరం నిర్వహించి బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, మహిళ చట్టాలపై అవగా హన, రక్తహీనత వల్ల ఏర్పడే ఆరోగ్య సమస్యలు, వాటికీ పరిష్కార మార్గా లపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచి వాలయ కార్యదర్శి జగదీష్, జిఎం.ఎస్‌కె.మౌనిక, ఎఎన్ఎం, అంగన్వాడీ కార్యకర్త , ఆశా కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు. **కలికిరి:** కిశోర బాలికలలకు సమాజం పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ సిడిపిఒ భారతి పేర్కొన్నారు. మంగళవారం ఐసిడిఎస్ వాల్మీకిపురం ప్రాజెక్టు పరిధిలోని కలికిరి మండలం లో 1, 2 సచివాలయాల పరిధిలో గల కిషోర్ బాలికలు, వారి తల్లులకు కిశోరి వికాసం ముగింపు కార్యక్రమం వెలుగు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ మే 2వ తేదీ నుంచి ప్రతి వారంలో రెండు రోజులు కిశోర వికాసం సమ్మర్ క్యాంపులు శిక్షణా తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిషోరి బాలికల ఆరోగ్యం, విద్య, పరిశుభ్రత, క్రీడలు వంటి వాటి గురించి అవగాహన కల్పించారు. ఈ ముగింపు కార్యక్రమంలో భాగంగా ఉన్నత బాలికల పాఠశాలలోని 10వ తరగతి పరీక్ష ఫలితాల లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలు ఐన జె జెనీఫర్ సలోని, పి అఖిల, జి లేఖన ప్రియ, విద్యార్థులకు సన్మానం చేశారు. జి.లేఖన ప్రియ నృత్య ప్రదర్శకాకట్టుకుంది. కార్యక్రమంలో సిడిపిఓ భారతి, సూపర్వైజర్ అరుంధతి, ఎమ్మెస్ కే వజ్రావతి, అంగన్వాడీ కార్యకర్తలు, కిషోర బాలికలు వారి తల్లులు పాల్గొన్నారు.

12న జిల్లా స్థాయి సీనియర్ అథ్లెటిక్స్ పోటీలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు : బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12న గురువారం ఉదయం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో జిల్లాస్థాయి సీనియర్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామని ఫౌండేషన్ కార్యదర్శి తెలిపారు. సీనియర్ విభాగంలో మహిళలు, పురుషులకు 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, లాంగ్‌జంప్, ట్రిపుల్ జంప్, హై జంప్, షాట్ పుట్, డిస్కస్ త్రో జిల్లాస్థాయి పందేలు నిర్వహిస్తామన్నారు. ఇందులో కడప జిల్లా వారు ఎవరైనా పాల్గొనవచ్చును అన్నారు.

వృద్ధురాలి అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని రెడ్డిపల్లి అరుంధతివాడ గ్రామానికి చెందిన తాళ్లపాక సుబ్బమ్మ (82) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రొంపిచర్ల మురళీ మృతురాలి కుటుంబానికి రూ.20వేలు దహన సంస్కారాల కోసం అందించారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ తాళ్లపాక సుబ్బమ్మ ఒంట రి మహిళగా జీవనం సాగిస్తూ మృతి చెందడం భాదకరమని అన్నారు. మృతు రాలి సంతానం లేరని, ఆమె సమీప బంధువులకు దహన సంస్కారాల కోసం కోసం రూ.20వేల ఆర్థిక సాయం చేసినట్లు తెలిపారు.

ఆర్థిక సాయం అందిస్తున్న మురళీ

క్రైం కార్నర్

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని పందికుంట గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బుక్కే వెంకటరమణ నాయక్ పైన కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి. శ్రీరాములు పేర్కొన్నారు. మే 30న ఆటోలో కొర్లకుంట ఎగువతుపల్లి నుంచి ఎద్దుల నర్సింహారెడ్డి, శ్రీదేవి, అనూహ్య కుటుంబ సమేతంగా నూలివీడులో జరిగే జాతరకు వెళ్లారని తెలిపారు. జాతర ముగించుకొని తిరిగి బుక్కే వెంకటరమణనాయక్ ఆటోలో వస్తుండగా వెంకటాపురం, నల్లగుట్ట వద్ద ఆటో బోల్తా పడిందని తెలిపారు. ఈ ప్రమాదంలో అనూహ్యకు కాలు, చేయి విరిగిందని తెలిపారు. కడపలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నట్లు తెలిపారు. మంగళవారం ఎద్దుల నరసింహారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రెండు గ్రూపుల మధ్య ఘర్షణ : కేసు నమోదు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

వ్యవసాయ పొలం వద్ద రెండు గ్రూపుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు మండలం లోని మొర్రోల్లపల్లిలో నివాసం ఉండే వెంకటరమణ కుమారుడు కాంతారావు తన వ్యవసాయ పొలం వద్ద ఉండగా అదే గ్రామానికి చెందిన ఎం.సోమశేఖర్, సునీల్, లావణ్య, అమ రావతి, గిరిబాబు, మౌనిక, కిట్టమ్మ అనువారు కాంతారావుని అసభ్యకరంగా దూషించి దాడి చేసేందుకు వచ్చారని తెలిపారు. కాంతారావు భార్య, కుమార్తె అడ్డురాగా వారిపై కూడా దాడి చేసినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. కాంతారావు ఫిరాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

లక్ష్మీదేవమ్మ (ఫైల్ ఫొటో)

ఒంటరి జీవితం పై విరక్తి చెందిన మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మంగళవారం కురబలకోట మండలంలో వెలుగు చూసింది. ముదివేడు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, చంద్ర కాలనీ సమీపంలోని లక్ష్మీనగర్‌కు చెందిన రవి భార్య లక్ష్మీ దేవమ్మ (46) పెళ్లైన రెండేళ్లకే భర్తను వదిలేసింది. ఆ తరువాత క్రమంగా నలిగురితో సహజీవనం చేసింది. ప్రస్తుతం ఆంజనేయులు అనే వ్యక్తితో సహజనం చేస్తూ కాలం వెళ్లదీస్తోంది. ఈ క్రమంలో వీరిద్దరి మధ్య తలెత్తిన గొడవల వల్ల మనస్థాపానికి గురై జీతంపై విరక్తి చెంది కురబలకోట మండలంలోని సర్కార్ తోపు వద్దకు వెళ్ళింది. రోడ్డు పక్కన ఉన్న అల్లనేరేడు చెట్టుకి తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న మృతురాలి తమ్ముడు శ్రీనివాసులు సంఘటనా స్థలంలో మృతదేహాన్ని గుర్తించాడు. ఈ మేరకు తనకు ఎలాంటి అనుమానాలు లేవని ఆమె ఆత్మహత్య చేసుకుని ఉంటుందని పోలీసులకు తెలిపాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.